# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–1 జనవరి 5, 2015

ప్రభుత్వ భూములను ఆక్రమించి భవనాలు కట్టుకున్న వారు వాటిని రెగ్యులరైజ్ చేయించుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. ఆక్రమణలకు తావులేకుండా పూర్తి స్థాయి ప్రక్షాళన జరగడం కోసమే ప్రభుత్వం క్రమబద్దీకరణ నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. క్రమబద్దీకరణకు ఇదే చివరి అవకాశమని, నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని క్రమబద్దీకరించుకోని వారిని ఆక్రమణలదారులుగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. అలాంటి ఆక్రమణ దారుల పట్ల ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, పీడి యాక్టు కూడా ప్రయోగించడానికి వెనకాడదని వివరించారు.

పేదల భూముల క్రమబద్దీకరణ, ఇతర నిర్మాణాల క్రమబద్దీకరణ అంశంపై సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, రెవెన్యూ శాఖ కార్యదర్శి మీనా తదితరులతో సమీక్షించారు. 125 గజాల వరకు ప్రభుత్వ భూమిలో పేదలు ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకుంటే ఉచితంగానే క్రమబద్దీకరణ చేయాలని నిర్ణయించినందున, అలాంటి వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వారి విషయంలో కూడా ఎంత విస్తీర్ణానికి ఎంత ధర చెల్లించాలో కూడా నిర్ణయించినందున సదరు వ్యక్తులు కూడా సంబంధిత దరఖాస్తులు వెంటనే సమర్పించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూముల దురాక్రమణకు చరమగీతం పాడాలని, భూముల రిజిస్ట్రేషన్లన్ని కూడా సక్రమంగా ఉండాలని, మొత్తంగా భూముల వ్యవహారంలో ప్రక్షాళన జరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత నెల 31ననే ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. జీఓ విడుదలైన 20

రోజుల్లోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పిన విషయాన్ని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఆ తరువాత అధికారులు విచారణ జరిపి 90 రోజుల్లోగా క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తారని వెల్లడించారు. మొత్తంగా ఈ ప్రక్రియ అంతా ఏప్రిల్ మాసం వరకు పూర్తవుతుందని చెప్పారు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్రంలో ఏ ప్రాంతంలో కూడా ఇంచు భూమి కూడా దురాక్రమణ జరగడానికి వీలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా వారిని కబ్జాదారులుగానే గుర్తించి కఠినంగా శిక్షిస్తామని వెల్లడించారు. ప్రభుత్వం ఎంతో ఉదారతతో క్రమబద్ధీకరణ కోసం అవకాశం కల్పించిందని, దీనిని కూడా ఉపయోగించుకోకుండా అక్రమ కబ్జాలు కొనసాగిస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన క్రమబద్ధీకరణ కార్యక్రమం మొత్తం ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడానికి నిర్ణయించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత మరోసారి ఇలాంటి క్రమబద్ధీకరణకు ఏలాంటి అవకాశం ఉండదని కూడా స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకోని స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంచు భూమికి టైటిల్ ఉండాలని చెప్పారు. క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రెవెన్యూ అధికారులను కోరారు.

---

సిపిఆర్ఓ టు సిఎం